

అవినీతికి మారు పేరు డీఎంకే

కుటుంబ పాలనే వారి లక్ష్యం ● కచ్చాదీవి పాపానికి ఫలితం అనుభవిస్తారు

● కోయంబత్తూరు సభలో ప్రధాని మోదీ శాపనార్థాలు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అవినీతికి మారు పేరు డీఎంకే అని, కుటుంబ పాలనే ఆ పార్టీ లక్ష్యమని, ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అవినీతి నేతలంతా పత్తా లేకుండా పోతారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శాపనార్థాలు పెట్టారు. కచ్చాదీవి వ్యవహారంలో చేసిన పాపాలకు డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు శిక్ష అనుభవించకతప్పదన్నారు. కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో బీజేపీ అభ్యర్థులు అన్నామలై (కోయంబత్తూరు), ఎల్.మురుగన్ (నీలగిరి), వసంతరాజన్ (పొల్లాచ్చి), మురుగానందం (తిరుప్పూరు)కు మద్దతుగా బుధవారం మధ్యాహ్నం ఏర్పాటైన ఎన్డీయే బహిరంగ సభలో ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. గత పదేళ్లుగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని 5జీ సేవలతో అభివృద్ధి పరుస్తుంటే 2జీలో అవినీతి అక్రమాలకు పాల్పడి డీఎంకే దేశ గౌరవాన్నే భ్రష్టు పట్టించిందన్నారు. అవినీతిని అంతమొందించాలని తాను పిలుపునిస్తుంటే డీఎంకే సహా ఇండియా కూటమి నాయకులు అవినీతిని కాపాడుదాం అంటూ పిలుపునిస్తున్నాయని విమర్శించారు. కోయంబత్తూరు సంగమేశ్వరాలయంలో ఉగ్రవాదులు దాడికి యత్నిస్తే వారిని కఠినంగా శిక్షించడానికి బదులుగా డీఎంకే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ వేర్పాటు వాదానికి మద్దతునిస్తోందని విమర్శించారు. వారం రోజులకు ముందు కేంద్ర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి కచ్చాదీవి వివాదాన్ని తాను ప్రస్తావిస్తే డీఎంకే, కాంగ్రెస్‌లు తనపై విరుచుకుపడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, డీఎంకేలు కుమ్మక్కయి ఆ దీవిని మరో దేశానికి ధారాదత్తం చేసి తమిళ జాలర్లకు తీరని ద్రోహం చేశాయని, ఈ ఎన్నికల్లో తగిన ఫలితం అనుభవించనున్నాయని మోదీ చెప్పారు.

డీఎంకే నేతలకు అహంకారం?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గురించి డీఎంకేకు చెందిన సీనియర్ నాయకుడొకరు 'అన్నామలై ఎవరు?' అంటూ ప్రశ్నించి తన అధికార అహంకారాన్ని వ్యక్తం చేశారని, బీసీ వర్గాలకు చెంది, కష్టపడి చదివి పోలీసు శాఖకు సేవలందించిన ఆ మాజీ పోలీసు అధికారి ఎన్నికల బరిలో వీరోచిత పోరాటం సాగిస్తుంటే ఎవరని అడుగుతారా అంటూ మోదీ మండిపడ్డారు. మరో డీఎంకే నేత లోక్‌సభ ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ మోదీని దేశం నుంచి తరిమికొట్టేందుకే ఈ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పడం గర్హనీయమన్నారు. అవినీతిని దేశం నుండి తరిమికొట్టేందుకు, కుటుంబ రాజకీయాలకు చరమగీతం పాడేందుకు, తమిళనాడు నుండి మాదకద్రవ్యాల మాఫియాను తరిమేందుకు, వేర్పాటువాదానికి వత్తాసు పలుకుతున్న డీఎంకేని తరిమికొట్టేందుకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. నీలగిరికి బీజేపీకి సుదీర్ఘ కాలం విడదీయలేని అనుబంధం ఉందని, వాజ్‌పేయి హయాంలో నీలగిరి నుండే బీజేపీ ఎంపీ పార్లమెంట్‌లో అడుగుపెట్టారని గుర్తు చేశారు. ఇండియా కూటమిలోని డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ 'పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ శపథాలు చేసి ఆ తర్వాత పట్టించుకోవన్నారు. తమ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన, జలజీవన్ పథకాల ద్వారా పేదలకు ఇళ్లు, ఆ ఇళ్ల వద్దకే కొళాయిల ద్వారా నీళ్లు అందిస్తోందన్నారు. బలహీన వర్గానికి చెందిన మహిళను అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసి గెలిపిస్తే, డీఎంకే, కాంగ్రెస్‌లు వ్యతిరేకంగా ఓట్లేసి బలహీన వర్గాలపై తమకున్న ద్వేషాన్ని చాటుకున్నాయని చెప్పారు. కరోనా లాక్‌డౌన్ కాలంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీస్తుందని, సన్న, చిన్నకారు, కుటీర పరిశ్రమలు పత్తా లేకుండా పోతాయని కూడా కాంగ్రెస్, డీఎంకే పార్టీలు జోస్యం చెప్పాయని, చివరకు తమ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను కాపాడేందుకు రూ.2లక్షల కోట్ల మేరకు నిధులిచ్చి ఆదుకుందన్నారు. తమిళనాట రెండో డిఫెన్స్ కారిడార్ వల్ల కూడా కోయంబత్తూరువాసులే అధికంగా లబ్ధిపొందనున్నారని చెప్పారు. వాణిజ్యనగరంగా పేరుపొందిన కోయంబత్తూరు ప్రజలకు డీఎంకే ప్రభుత్వం సక్రమంగా తాగునీటిని కూడా సరఫరా చేయలేకపోతోందని, ఆ నగరానికి పదిహేను రోజులకొకసారి మంచినీటిని సరఫరా చేస్తున్నారనే విషయం తెలుసుకుని తాను చాలా బాధపడుతున్నానన్నారు. మోదీ తన ప్రసంగాన్ని 'అనైవరుక్కుమ్ ఇనియ తమిళ్ పుత్తాండు నల్ వాళ్తుక్కళ్' (అందరికీ తీయని తమిళ సంవత్సరాది శుభాకాంక్షలు) అంటూ ప్రారంభించారు.



ఎన్నికల బాండ్ల అవినీతిని

బహిర్గతం చేస్తారా?



● నీట్‌ను రద్దు చేయలేరా?

● యేడాదికి 2 కోట్ల మందికి ఉపాధి ఏమైంది?

● విద్యను రాష్ట్ర జాబితాలో చేరుస్తారా?

● ప్రధాని మోదీకి 23 ప్రశ్నలు సంధించిన స్టాలిన్


అడయార్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి పదే పదే రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ తానడిగే 23 ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలంటూ డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పొందు పరచి ప్రశ్నలను సంధించారు. ప్రతి విషయానికి గ్యారెంటీ అంటూ చెబుతున్న మోదీ విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చుతానంటూ గ్యారెంటీ ఇస్తారా అని ప్రశ్నించారు. ఇదే విధంగా దేశవ్యాప్తంగా కులగణనను ఎప్పుడు చేపడతారో స్పష్టం చేయాలన్నారు. ఇటీవల మోదీ ప్రసంగాలను చూస్తుంటే దేశంలో రిజర్వేషన్లు మాయం అవుతాయనే అనుమానం కలుగుతోందని, కనుక రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని తొలగించే యోచన ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేశారో లేదో చెప్పాలని పేర్కొన్నారు. నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉందా? రాష్ట్రంలో హిందీ, సంస్కృత భాషలను బలవంతంగా రుద్దే ప్రసక్తే లేదంటూ గ్యారెంటీ ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. విద్యా రుణాలను మాఫీ చేస్తారా? యేడాదికి 2 కోట్ల మంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చేసిన శపథం గుర్తుందా? గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే కూలీని రూ.400కు పెంచలేరా? వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే అవకాశం లేదా? ఇష్టానుసారంగా రికార్డు స్థాయిలో పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తారా? అని అడిగారు. సెస్, సర్‌చార్జీలను రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు స్వతంత్రంగా, స్వేచ్ఛగా పని చేయనిస్తారా? రాష్ట్రాలను మోసం చేయకుండా, పక్షపాతం చూపకుండా నిధులను విడుదల చేసే యోచన ఉందా? లేదా? చిన్న, మధ్యతరహా వ్యాపారులకు జీఎస్టీ నుంచి మినహా ఇస్తారా? అని నిలదీశారు. వ్యాపమ్ నుంచి ఎలక్టోరల్ బాండ్ల వరకు బీజేపీ నేతల అవినీతి స్కాంను బహిర్గతం చేస్తారా? మీడియాకు, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు వ్యక్తులకు స్వేచ్ఛనిస్తారా? చైనా ఆక్రమించుకున్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంటారా?, శ్రీలంక నావికాదళం దాడుల నుంచి తమిళ జాలర్ల ప్రాణాలను, వారి పడవలను రక్షిస్తారా? అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేసే యోచన ఉదా? వరద సాయం కింద జాతీయ విపత్తుల సహాయ నిధిని మంజూరు చేస్తారా ఇలా మొత్తం 23 ప్రశ్నలతో ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

ఓటుకు నోటు కోసమేనా?

దుబాయ్ నుంచి రూ.200 కోట్లు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఓటర్లకు నగదు బట్వాడా చేసే నిమిత్తం రాష్ట్రానికి చెందిన ఓ రాజకీయ నాయకుడికి దుబాయ్ నుంచి రూ.200 కోట్ల హవాలా సొమ్ము తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక ఆదాయపు పన్నుల శాఖ అధికారులు ధ్రువీకరించారు. భారతీయ సంతతికి చెందిన వినోద్‌కుమార్ జోసెఫ్ దుబాయ్‌లో నివసిస్తున్నాడు. అతడి వంశీయులు రాష్ట్రానికి చెందిన ఓ నగరానికి చెందిన వారు. ఈ నేపథ్యంలో దుబాయ్ ప్రభుత్వం ఏదో కీలకమైన కారణాల వల్ల జోసెఫ్‌ను ఈ నెల 7న ఆ దేశం నుంచి తిప్పి పంపింది. మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జోసెఫ్‌ను అదుపులోకి తీసుకుని కస్టమ్స్, ఐటీ అధికారులు విచారణ జరిపారు. ఆ సందర్భంగా జోసెఫ్ ఐ ప్యాడ్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సెల్‌ఫోన్‌లో నమోదైన వాట్సప్ సందేశాలను పరిశీలించి అధికారులు దిగ్భ్రాంతి చెందారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీ నేతకు రూ.200 కోట్ల హవాలా సొమ్మును చెన్నైకి తరలించుకొచ్చేందుకు పథకం వేశాడని ఆ వాట్సప్ సంభాషణల ద్వారా అధికారులు గుర్తించారు. ఆ హవాలా సొమ్మును తరలించేందుకు సెల్వం అనే వ్యక్తితో జోసెఫ్ సంప్రదింపులు జరిపినట్లు తెలుసుకున్నారు. దుబాయ్‌కు చెందిన సెల్వం ద్వారా ఓ అభ్యర్థి కోసం ప్రచారం సాగిస్తున్న పార్టీ నిర్వాహకుడు అప్పు అలియాస్ వినాయక్‌వేలన్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఐటీ అధికారులు పేర్కొన్నారు. రూ.200 కోట్ల మేరకు హవాలా సొమ్మును రాష్ట్రానికి చేర్చేందుకు జోసెఫ్ పెద్ద నెట్‌వర్క్‌ను కూడా ఏర్పరచుకున్నాడు. దుబాయ్‌కి చెందిన మోనికా విరోలా, ఆలమన్నార్, మలేసియాకు చెందిన సురేష్ కు ఈ హవాలా సొమ్ము తరలింపు యత్నంలో సంబంధాలు ఉన్నాయని అధికారుల విచారణలో వెలుగు చూసింది. దీనితో ఐటీ, ఈడీ అధికారులు సంయుక్తంగా ఈ సంఘటనపై ముమ్మరంగా దర్యాప్తు జరిపేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకులను విచారించాలని భావిస్తున్నారు.

రేపు రాష్ట్రానికి కేంద్ర మంత్రి అమిత్ షా



పెరంబూర్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రానికి రానున్నారు. 12న శివగంగ, మదురైలో వాహన ప్రచారం చేపట్టనున్న కేంద్ర మంత్రి, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించనున్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయం, భైరం ఆలయం, మదురై మీనాక్షి అమ్మవారి ఆలయాలను షా సందర్శించనున్నారు. అలాగే, కన్నియాకుమారిలో 13వ తేది ప్రచారంలో పాల్గొననున్న అమిత్‌షా, సాయంత్రం నాగపట్టినం జరిగే ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించనున్నారు. అనంతరం తెన్‌కాశిలో జరిగే వాహన ప్రచారంలో ఆయన పాల్గొంటారు. వాస్తవానికి అమిత్‌షా ఈ నెల 4,5 తేదీల్లో రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ ప్రకటించినా, అనివార్య కారణాలతో ఆయన పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో

ఆరుగురి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పెరంబూర్, ఏప్రిల్ 10: మదురై సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. మదురై విల్లాపురానికి చెందిన కనకవేల్... విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపం దళవాయిపురంలో వెలసిన ప్రసిద్ధిచెందిన మారియమ్మన్ ఆలయ పూక్కుళి వేడుకల్లో పాల్గొనేందుకు కుటుంబసభ్యులతో కలసి కారులో బయల్దేరాడు. అక్కడ వేడుకల్లో పాల్గొన్న అనంతరం మంగళవారం సాయంత్రం విరుదునగర్ మారియమ్మన్ ఆలయంలో జరిగిన పంగుణి పొంగళ్ల వేడుకల్లో పాల్గొన్నాడు. వేడుకలు ముగిసిన తర్వాత కారులో మదురైకి బయల్దేరారు. కారును కనకవేల్ కుమారుడు మణి నడిపాడు. బుధవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో విరుదునగర్ - తిరుమంగళం రహదారి సివర్‌కోట సమీపంలో హఠాత్తుగా బైక్ అడ్డు వచ్చింది. గమనించిన మణి సడన్ బ్రేక్ వేశాడు. ఈక్రమంలో కారు బైక్‌ను డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణిస్తున్న కనకవేల్(62), ఆయన భార్య కృష్ణకుమారి(58), కనకవేలు కోడలు నాగజ్యోతి(28), నాగజ్యోతి కుమార్తె శివాత్మిక(8), బైక్‌పై వస్తున్న పాండి(55) సంఘటనాస్థలంలోనే మృతిచెందారు. అలాగే, కారులో ప్రయాణిస్తున్న మణి, రత్నస్వామి, మీనా, శివ ఆదిత్య, శివశ్రీ తీవ్రంగా గాయపడ్డారు.. చుట్టుపక్కల వారు వారిని మదురై రాజాజీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక శివశ్రీ మృతి చెందింది. ఈ ఘటనపై కల్లికుడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈవీఎంలలో

చిహ్నాల అమరిక షురూ



నమూనా ఈవీఎం

అడయార్, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 19వ తేదీన రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా పోలింగ్ కోసం ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల పేర్లతో పాటు వారి ఎన్నికల చిహ్నాలను అమర్చే ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తం 39 లోక్‌సభ స్థానాల్లో 950 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో ఉత్తర చెన్నై స్థానంలో 35 మంది, దక్షిణ చెన్నై స్థానంలో 41 మంది, సెంట్రల్ చెన్నై స్థానంలో 31 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇందుకోసం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేసే పనుల్లో ఎన్నికల సంఘ అధికారులు నిమగ్నమైనారు. 15 మంది కంటే ఒక్క అభ్యర్థి ఎక్కువ ఉన్నా రెండో ఈవీఎంను ఉపయోగించాలి. అందువల్ల చెన్నై జిల్లాలోని మూడు లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ కోసం కనీసం మూడు ఈవీఎంలను ఉపయోగించాల్సిన పరిస్థితి. ఈ ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 68,321 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్క చెన్నై జిల్లాలోనే 3,726 పోలింగ్ కేంద్రాలను 944 పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన 11,843 ఈవీఎంలు, 4469 కంట్రోల్ ప్యానెళ్లు, 4852 వీవీ ప్యాట్లను సిద్ధం చేస్తున్నారు. స్థానిక చింతాద్రిపేటలో భద్రంగా నిల్వ ఉంచిన ఈవీఎంలను చెన్నై జిల్లాలోని 16 అసెంబ్లీ స్థానాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య తరలించనున్నారు. ఈ నేపథ్యంలో ఈవీఎంలపై ఈసీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల చిహ్నాలతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను ఈవీఎంలపై అతికించే పనులను ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటిని పోలింగ్‌కు ఒక రోజు ముందు అంటే ఈ నెల 18న అన్ని పోలింగ్ కేంద్రాలకు పటిష్ఠ పోలీసు భద్రత మధ్య తరలించనున్నారు.



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్న ట్రిప్లికేన్ పెద్ద మసీదు

రంజాన్‌కు సర్వం సిద్ధం

● ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాల ముస్తాబు

● నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, ఏప్రిల్ 10: పవిత్ర రంజాన్ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఇస్లామీయులు సిద్ధమవుతున్నారు. గత నెల 12వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ ఉపవాస దీక్ష ప్రారంభమైంది. ఈ శుభప్రద మాసంలో నమాజు, రోజా, తారావీహ్, షబేఖదర్ జాగరణ, ఫిత్రా దానం, ఎతేకాఫ్, జకాత్, సదక్ వంటి సత్కార్యాలు అధికంగా ఆచరించిన ముస్లింలు తమను తాము సంస్కరింపజేసుకొని తద్వారా సమాజ సంస్కరణకు కృషి చేశారు.

ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి...

మహమ్మద్ ప్రవక్త మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు రంజాన్ మాసాన్ని సృష్టించారని ముస్లిం మతగురువులు చెబుతున్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం చేపట్టిన ముస్లింలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఆహారం, మంచి నీరు తీసుకోకుండా కఠోర దీక్షతో మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో గడిపారు. మంగళవారం ఇస్లామీయులు 29వ ఉపవాస దీక్ష పాటించారు. ఈ నేపథ్యంలో, షవ్వాల్ నెలవంక మంగళవారం సాయంత్రం ఏ ప్రాంతంలోను కనిపించలేదు. అందువల్ల రంజాన్ పండుగను గురువారం జరుపుకోవాల్సిందిగా తమిళనాడు ప్రభుత్వ చీఫ్ ఖాజీ సలాహుద్దీన్ మహమ్మద్ అయూబ్ అధికారికంగా ప్రకటించారు. దీంతో, రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన పురాతన మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. రాష్ట్ర పోలీసు శాఖ ప్రార్థనా మందిరాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసింది. పండుగ రోజు సేమియాతో ప్రత్యేకంగా తయారు చేసే షీర్ కుర్మా, చికెన్, మటన్ బిర్యానీ తదితర వంటకాలకు అవసరమైన సరుకుల కొనుగోలు చేసే ముస్లింలతో మార్కెట్ ప్రాంతాలు కళకళలాడాయి.



కోవైలో ప్రార్థనల్లో ముస్లింలు

ఇదిలా ఉండగా, అరబ్ దేశాల్లో మంగళవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో బుధవారం ఇస్లామీయులలో ఒక తెగకు చెందిన జాక్ కమిటీ ఆధ్వర్యంలో కోయంబత్తూర్ జిల్లాలో రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అదే విధంగా మన్నడి బిన్నీ మిల్ గ్రౌండ్‌లో తమిళనాడు దౌహీత్ జమాత్ రాష్ట్ర కార్యదర్శి అన్సారీ అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేతల శుభాకాంక్షలు... రంజాన్ పండుగ సందర్భంగా అందరి జీవితాల్లో ఐక్యత, శాంతి నెలకొనాలంటూ పలు రాజకీయపార్టీల నేతలు ఆకాంక్షిస్తూ ఇస్లామీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మతసామరస్యానికి ప్రతీక...

ఈపీఎస్

రంజాన్ మాసంలో రోజాలో పాల్గొన్న ఇస్లామీయులు సమాజ సంస్కరణకు కృషి చేశారు. మతసామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ సందర్భంగా ముస్లింలకు సుమారు రెండున్నర కోట్లు సభ్యులు కలిగిన అన్నాడీఎంకే తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, మనిదనేయ మక్కల్ కట్చి ఎమ్మెల్యే జవాహిరుల్లా తదితర నేతలు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

కష్టాలు తగ్గేందుకు పాటుపడదాం

● ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రపంచంలో శాంతి, సౌఖ్యం, మతసామరస్యం, సోదరభావం పెంపొందింపజేసేందుకు అందరం కలసి మెలసి జీవిద్దాం. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తగ్గించేందుకు పాటుపడదాం. మహమ్మద్ ప్రవక్త బోధనలను పాటించి మంచి మార్గంలో జీవించాలని ఈ రంజాన్ పర్వదినాన అందరం ప్రతినబూనుదాం.

సమాచార దర్శిని

పెరిగిన ఊటీ, కొడైకెనాల్ రిజర్వేషన్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: వేసవిలో ఊటీ, కొడైకెనాల్ వంటి శీతల ప్రదేశాలకు వెళ్లేందుకు రిజర్వేషన్లు 120 శాతం పెరిగాయని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. తక్కువ ఛార్జీతో పర్యాటక స్థలాలు సందర్శించేలా రైల్ టూర్ ప్యాకేజ్ పథకాన్ని ఐఆర్‌సీటీసీ అమలు చేస్తోంది. ఈ పథకంలో చెన్నై నుంచి ప్రతి ఏటా 10 నుంచి 20 శాతం పర్యాటక స్థలాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల నగరం నుంచి ఊటీ, కొడైకెనాల్, మదురై, కన్నియాకుమారి, రామేశ్వరం, మైసూరు, కశ్మీర్, అయోధ్య, నేపాల్ వంటి పర్యాటక స్థలాలకు టిక్కెట్లు రిజ్వేషన్ చేసుకొనే వారి సంఖ్య 120 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఈనెల 25వ తేది చెన్నై నుంచి కశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్, గుల్మార్గ్, సోనామార్గ్ వంటి పర్యాటక స్థలాలు 12 రోజులు సందర్శించేలా ఒకరికి రూ.45,500 ఛార్జీగా నిర్ణయించారు. అలాగే, మే 6వ తేది నేపాల్ ముక్తినాథ్ ఆలయం, మహేశ్వర్ గుహ వంటి ప్రాంతాలు సందర్శించేందుకు ఒకరికి రూ.50,600గా నిర్ణయించారు. వివరాలకు నెం.903140739లో సంప్రదించవచ్చు.

చెస్ పోటీలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: ఈస్ట్ తాంబరంలో ఉన్న శ్రీ హయగ్రీవర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిట్లపాక్కంలో ఉన్న రోజ్లీ మెట్రిక్యులేషన్ పాఠశాలలో మే 1వ తేది జరుగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 8, 10, 13, 25 ఏళ్లలోపున్న విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు నెం.7200101544లో ఈ నెలాఖరులోగా పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

1నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: స్థానిక కాటాన్‌కొళత్తూర్‌లో ఉన్న ఎస్ఆర్ఎం కళాశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే 1 నుంచి 31వ తేది వరకు జరగనున్నాయి. అథ్లెటిక్స్, క్రికెట్, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడలకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారు. 8 నుంచి 17 ఏళ్లలోపున్న బాలబాలికలు నెం.9842364483 సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ఎస్ఆర్ఎం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ మోహనకృష్ణ తెలిపారు.

పోలీసు శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 54 జూనియర్ రిపోర్టర్ పోస్టులకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లస్ టూ ఉత్తీర్ణులై 37 ఏళ్ల లోపు ఉండి టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులు. అభ్యర్థులను రాతపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14వ తేది వరకు www.eservices.tnpolice.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్‌ఎల్‌సీలో అప్రెంటీస్‌షిప్

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: నైవేలీ నేలబొగ్గు సంస్థ (ఎన్ఎల్‌సీ)లో అప్రెంటీస్‌షిప్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇండస్ట్రియల్ ట్రైనీ (ఎస్ఎంఈ) టెక్నికల్ 100, ఇండస్ట్రియల్ ట్రైనీ (మైన్స్ అండ్ మైన్స్ సపోర్ట్ సర్వీసెస్) 139 పోస్టుల భర్తీకి రాతపరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరగనుంది. ఇంజనీరింగ్, డిప్లొమో ఇంజనీరింగ్ కోర్సుల్లో 50 శాతం మార్కులు పొంది, 42 ఏళ్ల లోపున్న వారు ఈ నెల 19వ తేదిలోపు www.nlcindia.inలో దరఖాస్తు చేసుకోవచ్చు.

డ్రైవర్, అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: గణాంకాల సంస్థలో డ్రైవర్, బైండర్, లైబ్రరీ అసిస్టెంట్ తదితర పోస్టులకు ఈనెల 16వ తేదిలోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రైవర్ పోస్టులకు ప్లస్‌టూ ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం కలిగిన వారు, బైండర్ పోస్టులకు ప్లస్‌టూ ఉత్తీర్ణతతో పాటు ఐటీఐలో బైండర్ విభాగంలో ఏడాది అనుభవం కలిగిన వారు, లైబ్రరీ అసిస్టెంట్ పోస్టులకు ప్లస్‌టూతో పాటు లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమో చేసి టైపింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులు. దరఖాస్తు రుసుముగా రూ.500 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఇతర వివరాలకు www.isical.ac.inలో చూడవచ్చు.

నేడు సముద్రతీర జిల్లాల్లో వర్షాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: సముద్రతీర జిల్లాల్లో ఈనెల 11న గురువారం వర్షాలు కురిసే అవకాశమున్నట్లు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని సముద్రతీర జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: తిరువణ్ణామలైకు తిరునల్వేలి, తూత్తుకుడి నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది. తిరువణ్ణామలైలో ఈనెల 23వ తేది చిత్రా పౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. వారి సౌకర్యార్థం ప్రత్యే క బస్సులు నడిపేందుకు ప్రభుత్వ రవాణా సంస్థలు చర్యలు చేపట్టాయి. 22వ తేది ఉదయం నుంచి తిరువణ్ణామలైకు, 23వ తేది అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఈ బస్సులు నడపనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 3.40 లక్షల మంది చేరిక

పెరంబూర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం వరకు 3.40 లక్షల మంది విద్యార్థులు చేరారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 37,576 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం (2024-25) విద్యార్థుల అడ్మిషన్లు మార్చి 1నుంచి ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచితాలు, ఉన్నత విద్యలో రిజర్వేషన్లు తదితరాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. దీంతో, ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో 3.40 లక్షల మంది చేరగా, సేలం జిల్లాలో అత్యధికంగా 30,000 మంది విద్యార్థులు చేరారు. అలాగే, అంగన్వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పైబడిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే పనులు చేపట్టినట్లు, రాబోయే విద్యా సంవత్సరంలో 4 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఆవిన్ పాల కొనుగోళ్లు తగ్గుముఖం

పెరంబూర్, ఏప్రిల్ 10: రాష్ట్రవ్యాప్తంగా ఆవిన్ సంస్థ రైతుల నుంచి రోజుకు సుమారు 30 లక్షల నుంచి 31 లక్షల లీటర్ల వరకు పాలు కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం వేసవి తీవ్రం కావడంతో గేదెలు, ఆవుల్లో పాలిచ్చే సామర్థ్యం తగ్గింది. ముఖ్యంగా, ఈ నెల 1 నుంచి రోజుకు 5 లక్షల లీటర్ల వరకు తగ్గింది. దీంతో, ఆవిన్ సంస్థ 25 లక్షల లీటర్లు మాత్రమే కొనుగోలు చేస్తోంది. గత ఏడాది వేసవి కారణంగా పాల కొనుగోలు 26 లక్షల లీటర్లుండగా, ప్రస్తుతం లక్షల లీటర్లు తగ్గి 25 లక్షల లీటర్లకు చేరుకుంది.

సుఖశాంతులతో జీవిద్దాం

- శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఉగాది సంబరాల్లో వక్తలు



పారిశ్రామికవేత్త ఆదిత్యరామ్‌ను సత్కరిస్తున్న జేఎం నాయుడు, ఎంఎస్ మూర్తి తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 10: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అందరం సుఖశాంతులతో జీవిద్దామని శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఉగాది సంబరాల్లో పాల్గొన్న వక్తలు అభిలషించారు. అరుంబాక్కం డీజీ వైష్ణవి కాలేజి ప్రాంగణంలో శ్రీ ఆంధ్ర కళా స్రవంతి తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఉగాది సంబరాలు వైభవంగా జరిగాయి. స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు సారథ్యం వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆదిత్యరామ్ గ్రూప్ సంస్థల అధినేత ఆదిత్యరామ్, విశిష్టఅతిథులుగా ఐఎస్వీ గ్రూప్ ఛైర్మన్ బద్రీనారాయణ ప్రసాద్ హాజరయ్యారు. విశాఖపట్టణం స్నేహాంజలి ఆర్ట్స్ ఆధ్వర్యంలో కూచిపూడి, కాంతారి, శివతాండవం నృత్యప్రదర్శనను కళాకారులు తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం వేదపండితులు సుసర్ల కుటుంబ శాస్త్రి పంచాంగ పఠనం వినిపించారు. జేఎం నాయుడు స్వాగతోపన్యాసం చేస్తూ... ప్రతి సంవత్సరం ఆంధ్ర కళా స్రవంతి తరపున జరుపుకుంటున్న ఉగాది వేడుకల్లో ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్ బ్యాగులు, తెలుగు మీడియం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎడవల్లి అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతం ఆలపించగా ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ కార్యదర్శి నివేదిక సమర్పించారు. సలహాదారులు ఎంఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు వీఎస్ హరినాథ్, కేఎస్ సురేష్‌బాబు, పి.సరస్వతి సహా స్రవంతి సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో చిత్రా గజగౌరి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కోశాధికారి జీవీ రమణ వందన సమర్పణ చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎంకే కౌన్సిలర్ సమీనా సెల్వం, గొల్లపల్లి ఇశ్రాయేలు తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 10: స్థానిక తరమణి మైలై బాలాజీ నగర్‌లో తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు టామ్స్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి ఇశ్రాయేలు ముఖ్యఅతిథిగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించగా, టామ్స్ అధ్యక్షుడు నేలటూరు విజయకుమార్ సారథ్యం వహించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 188వ వార్డు డీఎంకే కౌన్సిలర్ ఎస్.సమీనా సెల్వం, డీఎంకే వార్డు కార్యదర్శి వి.రంజిత్‌కుమార్ ఆత్మీయ అతిథులుగా పోటీల్లో పాల్గొని విజేతలకు నగదు బహుమతి, వృద్ధులు, మహిళలకు ధోవతి, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రొడ్డా జైరాజ్, బి.పెంచలయ్య, సీహెచ్ తిరుపాల్, జి.దేవదాస్, వెంకటరమణయ్య, ఆరోగ్యదాస్ సహా కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా పంచాంగ శ్రవణం వినిపించిన అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉగాది పచ్చడి, అల్పాహారం పంపిణీ చేశారు.

19న వైగై డ్యాం నీటి విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: మదురై చిత్తిరై ఉత్సవాల కోసం వైగై డ్యాం నుంచి ఈ నెల 19వ తేదిన నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో ఉన్న ఈ డ్యాం ద్వారా తేని, దిండుగల్, మదురై, శివగంగ, రామనాథపురం జిల్లాలకు సాగు, తాగునీరు సరఫరా అవుతోంది. గత నవంబరులో కురిసిన వర్షాలకు 71 అడుగుల ఎత్తున్న ఈ డ్యాం పూర్తి సామర్థ్యంతో నిండింది. వ్యవసాయానికి నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, నీటినిల్వలు గణనీయంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మదురై చిత్తిరై ఉత్సవాల్లో కళ్లలగర్ వైగై నది ప్రవేశ కార్యక్రమం కోసం నీటిని విడుదల చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాలు ఈనెల 19వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 23వ తేది కళ్లలగర్ వైగై నదిలో దిగే కార్యక్రమంలో లక్షలాదిమంది భక్తులు పాల్గొననున్నారు. ప్రస్తుతం 60 అడుగులు నీటిమట్టం కలిగిన ఈ డ్యాం నుంచి ఉత్సవాల కోసం 19వ తేది సాయంత్రం 6 గంటల నుంచి 23వ తేది వరకు నీరు విడుదల చేయనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నీలగిరి ఓటరు జాబితాలో కనిపించని 10 వేల మంది పేర్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 10: నీలగిరి జిల్లాలో 10 వేలమంది పేర్లు ఓటరు జాబితాలో కనిపించడం లేదు. నీలగిరి లోక్‌సభ నియోకవర్గంలో ఊటీ, కున్నూరు, కూడలూరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఊటీలో 1,94,256 మంది ఓటర్లు, కూడలూరులో 1,91,614 ఓట్లు, కున్నూరులో 1,87,754 మంది ఓటర్లున్నారు. ఉపాధి కోసం కొందరు రైతులు కోయంబత్తూర్, తిరుప్పూర్ జిల్లాలకు వలస వెళ్లారు. ఆ ప్రకారం, ఊటీ నియోజకవర్గంలో 6,500, కున్నూర్‌లో 2,500, గూడలూరులో 1,000 మంది అని 10,000 మంది ఓటర్లు జాబితాలో కనిపించడంలేదు.

అడుగంటిన నీలగిరి డ్యాంలు



బురద గుంటగా కనిపిస్తున్న అవలాంజి డ్యాం


ఐసిఎఫ్, ఏప్రిల్ 10: నీలగిరిలో డ్యాంలలో నీరు అడుగంటడంతో ఆరు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేసినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ జిల్లాలో ముక్కుర్తి, బైక్రా, చాండినల్ల, క్లన్‌మార్కన్, మాయార్, అప్పర్ భవాని, పార్సన్స్‌వ్యాలీ సహా 10 డ్యాంలున్నాయి. వీటి ద్వారా 833 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతోంది. డ్యాంలో ఉన్న నీటిని విద్యుదుత్పత్తికి వినియోగించడంతో 20 శాతం మేర ప్రస్తుతం నీటి నిల్వలున్నాయి. పీక్ అవర్ అనే ఉదయం 6 నుంచి 9 గంటలు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుదుత్పత్తి జరుగుతోంది. కొన్ని డ్యాంల్లో నీరు లేకపోవడంతో ఉత్పత్తి నిలిపివేశామని అధికారులు తెలిపారు.

11 జిల్లాల్లో రామనవమి యాత్రను అనుమతించం

- మద్రాసు హైకోర్టు

పెరంబూర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో 11 జిల్లాల్లో రామనవమి యాత్రకు అనుమతించలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. ఏదైనా ఒక జిల్లాలో యాత్రకు అనుమతించవచ్చని హైకోర్టు సూచించింది. ఎన్నికల భద్రత కారణంగా ఈ ఏడాది రామనవమి యాత్రను అనుమతించలేమని ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. శ్రీరామనవమి సందర్భంగా కేరళ రాష్ట్రం నుంచి కన్నియాకుమారి వరకు రామనవమి యాత్ర నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ యాత్ర ట్రస్ట్ తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే.

రేలాలో పార్కిన్‌సన్స్ చికిత్సా కేంద్రం



చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహమ్మద్ రేలా, పవన్‌కుమార్ రెడ్డి తదితరులు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో పార్కిన్‌సన్స్ రోగుల కోసం డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) ట్రబుల్ షూటింగ్ క్లినిక్ ఏర్పాటైంది. బుధవారం మధ్యాహ్నం ఆ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో చికిత్సా కేంద్రాన్ని రేలా ఆసుపత్రి ఛైర్మన్ మహమ్మద్ రేలా, తాంబరం డిప్యూటీ పోలీసు కమిషనర్ పవన్‌కుమార్ రెడ్డి, సత్యానంద యోగా సెంటర్ వ్యవస్థాపకుడు సన్యాసి శివరుషి, హాస్యనటుడు పుగళ్... జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఆ సందర్భంగా మహమ్మద్ రేలా మాట్లాడుతూ వణుకుడు వ్యాధితో బాధపడుతున్న వారికి డీబీఎస్ పరికరాన్ని అమర్చి మెదడులో కదలికలు పుట్టించి చికిత్స అందిస్తామన్నారు. ఈ పరికరం అమర్చడానికి రూ.10లక్షల నుంచి రూ.15లక్షల దాకా ఖర్చవుతుందని తెలిపారు. డీబీఎస్ పరికరం సామాన్యులకు కూడా అందు బాటులో తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం లాగే తమిళనాడు ప్రభుత్వం కూడా తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఈ నెలాఖరు వరకు ఆ వ్యాధితో బాధపడుతున్నవారికి ఉచిత కన్సల్టేషన్ కల్పిస్తున్నామన్నారు. నెం.044 65557777కు ఫోన్ చేసి ఇతర వివరాలు తెలుసుకోవచన్నారు.

ఏనుగు దంతాలు తరలించిన ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 10: కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లో ఏనుగు దంతాలు తరలించిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. తమిళనాడు అటవీ శాఖ దర్యాప్తు విభాగానికి చెందిన అధికారులు మంగళవారం రాత్రి నాగర్‌కోయిల్ చెట్టికుళంలో వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేసి, అందులో 2.3 కిలోల బరువు కలిగిన ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం తూత్తుకుడికి చెందిన పుదియవన్, నాగర్‌కోయిల్‌కు చెందిన ముత్తురమేష్‌ను అరెస్ట్ చేశారు.

తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘ ఆధ్వర్యంలో వేడుకలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 10: తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం (టీటీసీఏ) ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం పెరంబూర్ బీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా దక్షిణ రైల్వే డివిజన్ మేనేజర్ బి.విశ్వనాథ్ ఈర్య హాజరయ్యారు. విశిష్టఅతిథిగా పారిశ్రామికవేత్తలు వెలం శ్రీనివాసులు, నర్రావుల వెంకటరమణ పాల్గొన్నారు. డాక్టర్ టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం గావించగా, అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతం ఆలపించారు. కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు షీల్డులు బహూకరించి అభినందించారు. డాక్టర్ షీలా ఉన్నికృష్ణన్ నాట్య బృందం సాంస్కృతిక కార్యక్రమం శ్రోతలను ఆకట్టుకుంది.

అడ్రినల్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

అడయార్, ఏప్రిల్ 10: యూరాలజీ, నెఫ్రాలజీ వైద్య సేవల్లో దేశంలో గుర్తింపు పొందిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజి (ఏఐఎన్‌యూ) వైద్యులు 34 యేళ్ల రోగికి అడ్రినల్ ట్యూమర్‌ను తొలగించారు. ఈ ఆపరేషన్ సక్సెస్ మూత్రపిండ సంరక్షణలో అద్భుతమైన విజయంగా ఏఐఎన్‌యూ పేర్కొంది. లాపరోస్కోపిక్ రైట్ అడ్రినలెక్టమీ అని పిలిచే క్లిష్టమైన ప్రక్రియ ద్వారా కుడి అడ్రినల్ ట్యూమర్‌తో బాధపడుతున్న రోగికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్టు యూరాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్, ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణియం వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, పొత్తికడుపులో నొప్పి, రక్తపోటు, మధుమేహ సమస్యలతో వచ్చిన రోగికి వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి కుడి వైపున అడ్రినల్ ట్యూమర్ ఉన్నట్టు గుర్తించి తొలగించినట్టు తెలిపారు. ఈ ట్యూమర్లు కాటెకొలమైన్ అనే అదనపు హార్మోన్‌లను ఉత్పత్తి చేస్తాయని, వీటిద్వారా హృదయ స్పందన రేటు, దడ, చెమట తలనొప్పి, చక్కెర స్థాయి పెరుగుతాయన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



పూల బుట్టల ఊరేగింపులో మంత్రి పీకే శేఖర్‌బాబు, నిర్వాహకులు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

ప్యారీస్, ఏప్రిల్ 10: స్థానిక జార్జి టౌన్ ఆదియప్పనాయకర్ వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా పుష్పయాగం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కర పంతులు పంచాంగ పఠనంతో వేడుకలు ప్రారంభం కాగా, పుష్పకలశాల ఊరేగింపు కార్యక్రమాన్ని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. 150 బుట్టల పుష్పాలను అమ్మవారికి సమర్పించి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఎస్కేపీడీ ట్రస్టీలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించారు.

ఎంటీసీ బస్సు అద్దాలు పగులగొట్టిన యువకుడి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 10: నగరంలో ఎంటీసీ అద్దాలు పగులగొట్టిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నూర్ నుంచి ఎగ్మూర్ వైపుకు వెళ్తున్న నెం.28బి ఎంటీసీ బస్సు మంగళవారం ఉదయం తిరుపల్లి బస్టాండ్ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికి బస్సులో ప్రయాణిస్తున్న యువకుడు బస్సు ఆపాలని కోరాడు. అందుకు డ్రైవర్ కుమార్ నిరాకరించి, బస్సును ముందుకు పోనిచ్చాడు. దీంతో ఆగ్రహించి డ్రైవర్‌పై దాడిచేశాడు. అనంతరం డ్రైవర్ బస్సు ఆపిన వెంటనే కిందకు దిగిన యువకుడు, రాయి విసరడంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు కొండితోపు సుందరముదాలి వీధికి చెందిన ప్రకాష్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

బ్లాక్‌లో ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

8 మంది అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 10: ఐపీఎల్ టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 8వ తేది స్థానిక చెపాక్ క్రికెట్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ - కోల్‌కత్తా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు ఆన్‌లైన్‌లో ప్రారంభమైన 10 నిమిషాల్లోనే విక్రయమయ్యాయి. దీంతో మ్యాచ్ చూడాలని ఆసక్తితో అక్కడకు చేరుకున్న అభిమానులకు కొందరు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు ట్రిప్లికేన్ పోలీసులకు ఫిర్యాదులందాయి. దీంతో పోలీసులు స్టేడియం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న కౌశిక్, రాజేష్‌కుమార్, ఉదయకిరణ్, అళగప్పన్, రాజపాండి, జయవేలు, ఇమ్మానుయేల్, సచిన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13,500 విలువైన 13 టిక్కెట్లు, రూ.2,950 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చెన్నైలో ఆల్టెయిర్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకులు

అడయార్, ఏప్రిల్ 10: కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ), డేటా అనలిటిక్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఆల్టెయిర్... చెన్నైలో తన కేంద్రాన్ని ప్రారంభించింది. తన వ్యూహాత్మక విస్తరణలో కస్టమర్ బేస్‌కు సేవ చేయడంలో ఆల్టెయిర్ తన నిబద్ధతను చాటుకోనుంది. చెన్నైలో కార్యాలయంలో వంద మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఇది ఇంజనీరింగ్, సాంకేతిక బృందాలకు కేంద్రంగా పనిచేయనుంది. ఈ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆల్టెయిర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథరావు మాట్లాడుతూ... విస్తరిస్తున్న కస్టమర్ బేస్‌తో పాటు ఇంజనీరింగ్ సిమ్యులేషన్ సొల్యూషన్స్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని చెన్నై కార్యాలయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు.

విదేశీ మానుకుని... స్వదేశీ పర్యటన

- తేని సభలో స్టాలిన్ ఎద్దేవా



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పదేళ్లు తరచూ విదేశాల్లో పర్యటించిన ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కారణంగా స్వదేశంలో పర్యటిస్తున్నారని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ యెద్దేవా చేశారు. తేని లక్ష్మీపురంలో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా బుధవారం సాయంత్రం ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రశాంత భారతం కాస్తా అశాంతి భారతంగా మారుతుందని హెచ్చరించారు. పదేళ్లపాటు తమిళ ప్రజలకు ఏమీ చేయలేని ప్రధాని మోదీ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మాయమాటలు చెప్పేందుకే రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓట్లు పడవనే విషయం ఆయనకూ తెలుసన్నారు. చెన్నైలో రోడ్‌షో జరిపిన మోదీ మెట్రోరైలు పథకం అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పడం గర్హనీయమని, రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు, మదురైలో ఎయిమ్స్ నిర్మాణానికి కేంద్రం నుంచి విడుదల కాలేదనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని స్టాలిన్ పేర్కొన్నారు.

మోదీజీ... ఎన్నిసార్లు వచ్చినా ఓట్లు రాలవు

- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోదీ రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా ఓట్లు రాలవని, రాష్ట్రంలో తామర వికసించే అవకాశమే లేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి విజయం సాధించాలనే తలంపుతో బీజేపీ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని, ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థలను ప్రతిపక్ష నేతలపై ఉసిగొల్పుతోందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత ప్రధాన ప్రతిపక్షాలకు చెందిన నాయకులకు ఇళ్లలోనే తనిఖీలు జరుగుతున్నాయని, బీజేపీ, దాని మిత్రపక్షాల జోలికి ఐటీ, ఈడీ సంస్థలు కన్నెత్తి చూడడం లేదన్నారు. తప్పుడు కేసులు, తనిఖీలు జరిపి ప్రతిపక్షాలను బెదిరించి గెలవాలని బీజేపీ కుట్రపన్నుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రముఖులు, నేతలను ఐటీ దాడులు జరుపుతామని, అరెస్టు చేస్తామని బెదరించి ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 25 మంది నేతలను బీజేపీలో చేర్చుకున్నారు. ఇక ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు తక్కువగా బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎక్కుగా నిధులు మంజూరు చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని సెల్వపెరుంతగై అన్నారు. వందసార్లు పర్యటించినా రాష్ట్రంలో బీజేపీ, దాని మిత్రపక్షాల అభ్యర్థులకు ఓట్లు పడవని ఆయన పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్త త్యాగరాజన్ ఇంటిలో ఐటీ సోదాలు

అడయార్, ఏప్రిల్ 10: స్థానిక కేకే నగర్‌కు చెందిన పారిశ్రామికవేత్త, ప్రభుత్వ కాంట్రాక్టర్ త్యాగరాజన్ ఇంట్లో ఐటీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. త్యాగరాజన్ ఇంజనీరింగ్ కాలేజీని కూడా నడుపుతున్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు కేకే నగర్, అశోక్ నగర్‌లో ఉన్న నివాసాల్లో భారీ మొత్తంలో నగదు నిల్వ చేసివున్నట్టు వచ్చిన సమాచారంతో తనిఖీలు చేశారు. ఏకంగా 4 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

సేలం బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంలో

ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు భారీ మొత్తంలో నగదు నిల్వ ఉంచినట్టు వచ్చిన సమాచారం మేరకు.. సేలం జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు ఇంట్లో ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. అలాగే, ఈ విషయాన్ని తెలుసుకున్న ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కూడా ఆయన నివాసానికి చేరుకున్నారు. కాగా ఇంట్లో నగదు లేదని వెల్లడించారు.

అశ్రునయనాలతో ఆర్‌ఎంవీ అంత్యక్రియలు



చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య సమస్యలతో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన ఎంజీఆర్ కళగం అధ్యక్షుడు ఆర్ఎం వీరప్పన్ (98) అంత్యక్రియలు ఆత్మీయుల అశ్రునయనాలు, ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం సాయంత్రం జరిగాయి. వళ్లువర్‌కోట్టమ్‌లోని తిరుమలైపిళ్లై వీధిలో ఆర్ఎంవీ నివాస గృహం వద్ద ఉంచిన ఆయన పార్థివ దేహానికి సినీ రంగ ప్రముఖులు, డీఎంకే, అన్నాడీఎంకే తదితర పార్టీల నేతలు నివాళి అర్పించారు. ఆ తర్వాత పూలతో అలంకరించిన ప్రత్యేక శకటంపై ఆర్ఎం వీరప్పన్ పార్థివదేహాన్ని ఉంచి నుంగంబాక్కంలోని విద్యుత్ దహనవాటికకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ అంతిమయాత్రలో ఎమ్జీఆర్ కళగం ప్రముఖులు, కంబన్ కళగం నిర్వాహకులు వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం 4గంటలకు ప్రభుత్వ లాంచనల నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

పీఎంకే నేత ఇంట్లో ఐటీ తనిఖీలు

పెరంబూర్, ఏప్రిల్ 10: విరుదాచలం సమీపం ఎడుక్కన్‌కుప్పానికి చెందిన పీఎంకే నేత సురేష్ ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. పీఎంకే కడలూరు లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా సురేష్ వ్యవహరిస్తున్నారు. ఆయన పీఎంకే విరుదాచలం జిల్లా మాజీ కార్యదర్శిగా ఉన్నారు. ఓటర్లకు నగదు పంచుతున్నారనే అనుమానంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

ఆ ఆరోపణలతో సంబంధం లేదు

- దర్శకుడు అమీర్

అడయార్, ఏప్రిల్ 10: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసు వ్యవహారంలో వచ్చిన ఆరోపణలకు తనకు ఎలాంటి సంబంధం లేదని సినీ దర్శకుడు అమీర్ తెలిపారు. ఆయన మదురైలో విలేకరులతో మాట్లాడుతూ, డ్రగ్స్ కేసుకు సంబంధించి ఎన్.సి.బి అధికారులు తమ ఇంట్లో 11 గంటల పాటు తనిఖీలు చేసిన మాట వాస్తవేమనని చెప్పారు. ఈ కేసు ప్రారంభం నుంచి తాను చెబుతున్న విషయం ఒక్కటేనని, ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

కృష్ణగిరి అన్నాడీఎంకే ఎమ్మెల్యే గెలుపు వ్యవహారం

హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన సుప్రీం

పెరంబూర్, ఏప్రిల్ 10: కృష్ణగిరి అన్నాడీఎంకే ఎమ్మెల్యే అశోక్‌కుమార్ గెలుపును వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. డీఎంకే అభ్యర్థి సెంగుట్టువన్ దాఖలు చేసిన పిటిషన్‌లో, నిరాకరించిన 605 తపాలా ఓట్లను రిజిస్ట్రార్ పర్యవేక్షణలో మళ్లీ లెక్కించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ అశోక్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌పై సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నీటి వసతి లేదంటూ ఖైదీల ఆందోళన

పెరంబూర్, ఏప్రిల్ 10: కడలూరు కేంద్ర కారాగారంలో నీటి వసతి సక్రమంగా లేదంటూ ఖైదీలు ఆందోళన చేపట్టారు. ఈ జైలులో సుమారు 700 మంది శిక్ష పడిన, విచారణ ఖైదీలున్నారు. జైలులో నీటి వసతి సరిగా లేదంటూ ఖైదీలు బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. వారిలో కొందరు భవనాలపై ఎక్కారు. సమాచారం అందుకున్న జైళ్ల శాఖ ఉన్నతాధికారులు అక్కడకు చేరుకొని ఖైదీలను సమాధానపరిచారు.


ట్వింకిల్ ఖన్నాతో విజయవంతంగా చర్చాగోష్ఠి



ట్వింకిల్ ఖన్నాతో ఫిక్కీ నిర్వాహకులు

అడయార్, ఏప్రిల్ 10: ప్రముఖ నటి, రచయిత ట్వింకిల్ ఖన్నాతో ఫిక్కీ ఎఫ్ఎల్ఓ చెన్నై విభాగం నగరంలో ఇష్టాగోష్ఠి నిర్వహించగా, అది విజయవంతమైంది. ఈ సందర్భంగా ట్వింకిల్ ఖన్నా తాను రచించిన 'వెల్‌కమ్ టు ప్యారడైజ్' పుస్తకంలోని ముఖ్యమైన అంశాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆధునిక మహిళపై తన ఆలోచనలను వ్యక్తం చేశారు. ఫిక్కీ మహిళా విభాగం ఎఫ్ఎల్ఓ తన చెన్నై చాప్టర్ 2023-24లో వివిధ కార్యక్రమాలపై 15 వేల మంది మహిళలతో కలిసి పనిచేస్తుంది. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి ఇన్‌కమింగ్ ఛైర్‌పర్సన్‌గా దివ్య అభిషేక్ బాధ్యతలు స్వీకరించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చరిత్రలో ఎన్నికైన అతి పిన్న వయస్కురాలిగా ఆమె గుర్తింపు పొందారు.

ఉగాదికి సెలవు తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు



గోపీనాథ్

● పండుగ కదా...

ప్యారీస్, ఏప్రిల్ 10: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తెలుగు వారు కావడంతో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకలు జరుపుకున్న సందర్భంగా ఎన్నికల ప్రచారానికి బ్రేక్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గోపినాథ్ డీఎంకే ఓటు బ్యాంక్‌పై ఆధారపడి ఎన్నికల బరిలో దిగారు. బీజేపీ అభ్యర్థి నరసింహన్ మిత్రపక్ష పార్టీలతో కలసి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయన కూడా మంగళవారం ఉగాది సందర్భంగా ప్రచారంలో పాల్గొనకుండా కుటుంబసభ్యులతో కలసి ఉగాది వేడుకలు జరుపుకున్నారు.

వీరప్పన్ కుమార్తె ఎన్టీకే అభ్యర్థి

● భార్య డీఎంకేకు మద్దతుగా ప్రచారం

● తల్లీకూతుళ్ల సవాల్



ముత్తులక్ష్మి - విద్యారాణి

ప్యారీస్, ఏప్రిల్ 10: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా గంధం చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి పోటీ చేస్తున్నారు. ఆమె తల్లి, వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి కుమార్తెకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనకుండా ధర్మపురిలో డీఎంకేను గెలిపించాలంటూ ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ముత్తులక్ష్మి తమిళగ వాల్వురిమై కట్చి సభ్యురాలు. ఆ పార్టీ ప్రస్తుతం డీఎంకే కూటమిలో భాగస్వామ్యం వహిస్తున్న కారణంగా ధర్మపురి డీఎంకే అభ్యర్థి మణికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ ఎన్నికల్లో కుమార్తె ఒక పార్టీలోను, తల్లి మరో పార్టీకి మద్దతుగా వ్యవహరించడం గమనార్హం.

బీజేపీ దెబ్బ... చిన్న పరిశ్రమల మూత!

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సౌందర్‌రాజన్

● విమర్శ

ప్యారీస్, ఏప్రిల్ 10: కేంద్రంలోని బీజేపీ తీసుకున్న నిర్ణయాలతో తొమ్మిదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు రెండున్నర కోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడ్డారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్ విమర్శించారు. ఉత్తర చెన్నైలో ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా సౌందర్‌రాజన్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా దాదాపు 7 కోట్లకు పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలున్నాయని, వాటిలో 2.5 కోట్ల పరిశ్రమలు మూతపడ్డాయని, ఇందుకు కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో సామాన్య ప్రజలు సైతం జీవనాధారం లేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని, దేశంలో కార్పొరేట్ సంస్థలకు ఊతమిస్తున్న బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాకుండా ప్రజలు ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన అభ్యర్థించారు.

● వీఐపీ నియోజకవర్గం

పెరంబలూరులో సమ ఉజ్జీల సమరం

మొత్తం ఓటర్లు: 14,46,351
పురుషులు: 7,01,400
మహిళలు: 7,44,807
ఇతరులు : 145



అరుణ్ నెహ్రూ (డీఎంకే)
చంద్ర మోహన్ (అన్నాడీఎంకే)
పారివేందర్ (బీజేపీ)



పెరంబూర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల జాబితాలో పెరంబలూరు నియోజకవర్గం 25వ స్థానంలో ఉంది. తొలుత ఈ నియోజకవర్గంలో పెరంబలూరు (రిజర్వుడు), ఉప్పిల్యాపురం (రిజర్వుడు), వాగూరు (రిజర్వుడు), అరియలూరు, ఆండిమఠం, జయంకొండాం తదితర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో వాగూరు అసెంబ్లీ నియోజకవర్గం కున్నం నియోజకవర్గంగా మారింది. అలాగే, ఆండిమఠం, ఉప్పిల్యాపురం నియోజకవర్గాలు రద్దవగా, అరియలూరు, జయంకొండాం తదితర అసెంబ్లీ నియోజకవర్గాలు, పెరంబలూరు జిల్లాలోని కున్నం అసెంబ్లీ నియోజకవర్గాలు చిదంబరం (రిజర్వుడు) లోక్‌సభ స్థానంలో చేరాయి. ప్రస్తుతం పెరంబలూరు (రిజర్వుడు), కరూర్ జిల్లాలోని కులితలై, తిరుచ్చి జిల్లాలోని లాల్‌కుడి, ముసిరి నియోజకవర్గాన్ని విభజించి కొత్త అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడిన మన్నచనల్లూర్, తురైయూర్ (రిజర్వుడు) తదితర ఆరు నియోజకవర్గాలున్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కులితలై, లాల్‌కుడి, మన్నచనల్లూర్, ముసిరి, తురైయూర్, పెరంబలూర్ తదితర ఆరు స్థానాలను డీఎంకే కైవసం చేసుకుంది.

డీఎంకే ఏడు సార్లు విజయం....

పెరంబలూరు లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరుగ్గా, డీఎంకే 7 సార్లు, అన్నాడీఎంకే 6 సార్లు, కాంగ్రెస్ 2 సార్లు, డీఎంకే కూటమి ఇందియ జననాయగ కట్చి (ఐజేకే), తమిళనాడు ఉళైప్పాలర్ పార్టీ తలా ఒక సారి విజయం సాధించాయి. అందులో డీఎంకే రెండు సార్లు, అన్నాడీఎంకే ఒకసారి హ్యాట్రిక్ విజయం నమోదు చేశాయి. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు డీఎంకే - అన్నాడీఎంకేలు 9 సార్లు నేరుగా తలపడగా, అన్నాడీఎంకే ఆరు సార్లు, డీఎంకే మూడు సార్లు విజయం సాధించాయి. ఈ నియోజకవర్గం నుంచి ఎంపీలుగా గెలుపొందిన ఎ.రాజా, నటుడు నెపోలియన్ కేంద్రమంత్రులుగా పనిచేశారు.

రైళ్ల సేవలు లేని పెరంబలూరు...

రాష్ట్రంలో రైళ్ల సేవలు లేని జిల్లాగా పెరంబలూరు ఉంది. ఈ నియోజకవర్గం ఎంపీలుగా వ్యవహరించిన ఎ.రాజా, మరుదురాజా పలుమార్లు పార్లమెంటు సమావేశాల్లో జిల్లాలో రైలు మార్గం ఏర్పాటు చేయాలని కోరినా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేకపోయింది. ప్రస్తుత ఎంపీగా ఉన్న పారివేందర్ విజ్ఞప్తి మేరకు, అరియలూరు - నామక్కల్ మధ్య పెరంబలూరు, తురైయూర్, టి.పేట మార్గంగా 116.26 కి.మీ మేర రైలు మార్గం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

2019 ఎన్నికల ఫలితాలు...

గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి డీఎంకే తరఫున 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై పోటీ చేసిన ఐజేకే అభ్యర్థి పారివేందర్ 6,83,697 ఓట్లతో విజయం సాధించారు. అన్నాడీఎంకే తరఫున పోటీ చేసిన ఎన్నార్ శివపతి 2,80,179 ఓట్లు, ఎన్టీకే అభ్యర్థి 53,545 ఓట్లు, ఏఎంఎంకే అభ్యర్థి 45,591 ఓట్లు పొంది తర్వాత స్థానాల్లో నిలిచారు. అదే సమయంలో 'నోటా'కు 11,325 ఓట్లు పోలవ్వడం గమనార్హం.

బరిలో అభ్యర్థులు...

ప్రస్తుత ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా మంత్రి కేఎన్ నెహ్రూ కుమారుడు అరుణ్ నెహ్రూ బరిలో నిలిచారు. అన్నాడీఎంకే తరఫున పెరంబలూరు జిల్లా ఎంజీఆర్ మండ్రం డిప్యూటీ కార్యదర్శి, దివంగత డీఎంకే మాజీ మంత్రి సెల్వరాజ్ తమ్ముడి కుమారుడు ఎన్డీ చంద్రమోహన్ పోటీ చేస్తున్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ పారివేందర్ డీఎంకే కూటమి నుంచి వైదొలిగి, బీజేపీ కూటమి తరఫున బరిలో నిలిచారు. ఇక, ఎన్టీకే తరఫున తెన్‌మొళి పోటీ చేస్తుండగా, ప్రస్తుతం పోటీ చేస్తున్న వారిలో మహిళా అభ్యర్థిగా నిలిచారు. అలాగే, బహుజన సమాజ్ పార్టీ, సామాన్య మక్కల్ సంక్షేమ పార్టీ, స్వతంత్రులు అని పలువురు బరిలో ఉన్నారు. 2019 ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 13,91,853 మంది ఉండగా, గడచిన ఐదేళ్లలో 54,499 మంది కొత్త ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో రైతులు ఎవరిని తమ ప్రజా ప్రతినిధిగా ఎన్నుకుంటారో జూన్ 4న తేలనుంది.

ప్రధాన సమస్యలు...

వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న నియోకవర్గం పెరంబలూరు. చిన్న ఉల్లి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. కానీ, రైతులు మాత్రం దీర్ఘకాలంగా పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్నఉల్లి మొక్కజొన్న తదితరాలు వినియోగించి ఆహార ఉత్పత్తులు తయారుచేసే కర్మాగారాలు నిర్మించాలని, పండించిన ఉత్పత్తులు నిల్వచేసుకొనేలా కోల్డ్ స్టోరేజీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయపార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, ఆచరణలో మాత్రం ఎక్కడి వేసిన గొంగడి అక్కడనే ఉందన్న అనే సామెతగా మారింది. పెరంబలూరు జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు గత 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. ప్రభుత్వ ఇంజనీరింగ్, వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పాడి రైతులు అధికంగా ఉండడంతో వారి సంక్షేమార్థం ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రి ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.

● ప్రచారంలో పాట్లు



విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ డీఎండీకే అభ్యర్థి విజయ్ ప్రభాకరన్‌కు మద్దతుగా శివకాశిలోని ఐస్ ఫ్యాక్టరీకి వెళ్లి ఐస్ తయారు చేస్తూ ప్రచారంలో పాల్గొన్న అన్నాడీఎంకే మాజీ మంత్రి రాజేంద్ర బాలాజి



సెంగోల్‌తో ప్రచారంలో పాల్గొన్న తిరుప్పూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మురుగానందం, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నేత అర్జున్ సంపత్



ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గ తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి విజయకుమార్‌తో కలసి సైకిల్ తొక్కుతూ ప్రచారంలో పాల్గొన్న ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్



తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ ముద్రించిన కరపత్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ చిత్రాలు

● ఓట్ల వేట





తేని రైతుబజార్‌లో కాయగూరల మహిళా వ్యాపారికి నమస్కరిస్తున్న సీఎం స్టాలిన్ - స్టాలిన్‌కు అరటిపళ్లు ఇస్తున్న మహిళ

తేనిలో స్టాలిన్ కాలినడక ప్రచారం

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తేనిలో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి వెళ్లిన డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉదయం వాకింగ్ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. తేని నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేస్తున్న తంగ తమిళ్‌సెల్వన్‌ను వెంటబెట్టుకుని ముదురు నీలిరంగు ప్యాంట్, నీలి రంగు టీషర్టు, వాకింగ్ షూస్ ధరించి స్టాలిన్ అక్కడి మార్కెట్‌లోని వ్యాపారులతో కబుర్లాడుతూ పార్టీ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. పెరియకుళం రోడ్డు, ఎన్ఆర్‌టీ రోడ్డులో ఆయన వాకింగ్ చేశారు. ఆ సందర్భంగా రహదారికి ఇరువైపులా ఉన్న కూరగాయల వ్యాపారులు, స్థానికులను కలుసుకుని డీఎంకేకు ఓటేయమని కోరారు. ఆ తర్వాత రైతు బజార్‌కు వెళ్ళి అక్కడి కాయగూరల వ్యాపారులకు నమస్కరిస్తూ ఓట్లేయాలని కోరారు. ఆ సందర్భంగా యువతీయువకులు స్టాలిన్‌ను చుట్టుముట్టి ఆయనతో సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. కూరగాయల వ్యాపారులు ఆయనకు షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు పోటీ పడ్డారు. సుమారు గంటకు పైగా స్టాలిన్ కాలినడకనే ప్రచారం చేశారు. మంత్రి పెరియసామి తదితరులు ఈ ప్రచార పర్యటనలో పాల్గొన్నారు.

తమిళనాట బీజేపీ హవా ఖాయం

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో బీజేపీ హవా ఖాయమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్ షోతో ఈ విషయం స్పష్టమైందని సెంట్రల్ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నియోజకవర్గంలో పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇన్నాళ్లు ద్రావిడ పార్టీలు ఇచ్చిన తప్పుడు హామీలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారని, అయితే ఏ పార్టీ నిజంగా ప్రజల కోసం పని చేస్తుందో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారన్నారు. తమ పార్టీ ఇచ్చే నిఖార్సయిన హామీలు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ పరిపాలనతో దేశవ్యాప్తంగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలోనూ ప్రజలు బీజేపీని ఆదరించేందుకు సిద్ధమయ్యారన్నారు. తన నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్రప్రభుత్వంతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానన్నారు. అందువల్ల నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని మనోజ్ పి.సెల్వం అభ్యర్థించారు.



వినోజ్‌కు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న ప్రజలు



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఈపీఎస్

వారిద్దరూ ఊసరవెల్లులు

● ఓపీఎస్, దినకరన్‌పై తేని సభలో ఎడప్పాడి ధ్వజం

ప్యారీస్, ఏప్రిల్ 10: అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓ.పన్నీర్‌సెల్వం, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్ ఊసరవెల్లిలా తరచూ రంగులు మారుస్తుంటారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి తీవ్రంగా విమర్శించారు. తేని లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి నారాయణస్వామికి మద్దతుగా తేనిలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పళనిస్వామి ప్రసంగించారు. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరిస్తున్న వారిలో సగం మంది అన్నాడీఎంకే నుంచి వెళ్లిన వారేనని, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తున్న వారు కూడా అన్నాడీఎంకేకు వెన్నుపోటు పొడిచిన వారేనని విమర్శించారు. స్వార్థం కోసం పార్టీ మారిన వారిలో ముఖ్యులైన ఓపీఎస్, దినకరన్ రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు రాకపోవడంతో ఊసరవెల్లిలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. డీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక్క వేదికపై కూడా రైతుల గురించి ప్రస్తావించడం లేదన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమార్థం ప్రవేశపెట్టిన పథకాలను డీఎంకే ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తూ వచ్చిన ల్యాప్‌టాప్ పథకాన్ని రద్దు చేసిందన్నారు. 38 మంది ఎంపీలున్నప్పటికీ రాష్ట్ర హక్కులపై ఒక్కరోజైనా పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించలేదన్నారు. డీఎంకే ప్రతిపక్షంగా వ్యవహరించిన సమయంలో గో బ్యాక్ మోదీ అని నినాదాలు చేసిందని ప్రస్తుతం ఆయన్ను ఆహ్వానిస్తోందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, డీఎంకే కూటములను అధిగమించి అన్నాడీఎంకే అధిక స్థానాల్లో గెలుస్తుందని ఈపీఎస్ చెప్పారు.





అన్నాడీఎంకే గెలుపు కోసం...

● అగ్నికలశం మోసిన గంజా కరుప్పు

● పార్టీ విజయం కోసం

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘన విజయం సాధించాలని కోరుతూ తమిళ సినీ హాస్యనటుడు గంజా కరుప్పు తిరుచ్చి సమీపం సమయపురం మారియమ్మన్ ఆలయంలో అగ్నికలశం మోశారు. భక్తులతోపాటు అగ్ని కలశాన్ని చేతపట్టుకుని ఆలయాన్ని ప్రదక్షిణ చేసిన తర్వాత ఆలయ ప్రధాన ద్వారం వద్ద దాన్ని నేలపై ఉంచి అన్నాడీఎంకే గెలిచేలా అనుగ్రహించు తల్లీ! అంటూ అమ్మవారివైపు నిలిచి వేడుకున్నారు. ఆ తర్వాత ఆలయం లోపలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, ఆ పార్టీకి మద్దతుగా తాను పలు జిల్లాల్లో ప్రచారం చేశానని చెప్పారు. అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధించాలని సమయపురం మారియమ్మన్‌ను మనసారా ప్రార్థించానని తెలిపారు.

సమయపురం మారియమ్మన్ ఆలయం వద్ద అగ్ని కలశం మోసుకెళుతున్న తమిళ సినీ హాస్యనటుడు గంజా కరుప్పు

ప్రొడ్యూసర్స్ గిల్డ్‌కు ఎన్నికలు నిర్వహించండి

● హైకోర్టు ఆదేశం



జాగ్వార్ తంగం

తమిళ చిత్రపరిశ్రమలోని ప్రొడ్యూసర్స్ గిల్డ్‌కు జూన్ 15వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ అధికారులుగా ఇద్దరు మాజీ న్యాయమూర్తులను నియమించింది. తమిళనాడు చలనచిత్ర నిర్మాతల మండలి, తమిళనాడు యాక్టివ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కమిటీ, సౌత్ ఇండియన్ ఫిల్మ్ అండ్ టీవీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్లను కలిపి ప్రొడ్యూసర్స్ గిల్డ్‌గా పిలుస్తారు. ఈ గిల్డ్ అధ్యక్షుడిగా జాగ్వార్ తంగం ఉన్నారు. ఈ సంఘానికి ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి, కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి వుంది. అయితే, ఈ సంఘం సభ్యుల మధ్య తలెత్తిన అభిప్రాయభేదాల కారణంగా 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుంచి అధ్యక్షుడిగా జాగ్వార్ తంగమే కొనసాగుతున్నప్పటికీ రిటైర్డ్ న్యాయమూర్తులు పర్యవేక్షణలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ గిల్డ్ కార్యదర్శిగా ఉన్న ఎం.జంబు అనే వ్యక్తి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన కోర్టు... 2024-26 సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. అలాగే, ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా మాజీ న్యాయమూర్తులు ఎం.సత్యనారాయణన్, వి.భారతిదాసన్‌ను నియమించింది. మార్చి 30వ తేదీ వరకు అర్హులైన సభ్యులకు ఓటు హక్కు కల్పించి, ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై ప్రకటించి, జూన్ 15వ తేదీలోపు ప్రొడ్యూసర్స్ గిల్డ్‌కు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

చిత్రజ్యోతి

పాతికేళ్ల పడయప్ప

కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'పడయప్ప' (తెలుగులో 'నరసింహా') చిత్రం విడుదలై బుధవారానికి పాతికేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో రజనీ సరసన రమ్యకృష్ణ, సౌందర్య నటించగా, ముఖ్యపాత్రలో నడిగర్ తిలగం శివాజీ గణేశన్ నటించారు. 1999 ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా విడుదలై 25 యేళ్ళు గడిచిపోయాయి. ఫ్యామిలీ, లవ్, యాక్షన్ ఇలా అన్ని అంశాలతో కమర్షియల్ చిత్రంగా రూపొందించగా, బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. ఈ సినిమా రజనీకాంత్ కెరీర్‌లోనే ది బెస్ట్ మూవీల్లో రెండో చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా పడయప్ప - నీలాంబరై పాత్రలు ఇప్పటికీ ప్రేక్షకుల మనస్సుల్లో నాటుకునిపోయాయి. ఇందులో రజనీ చెప్పిన డైలాగులు అప్పట్లో చర్చనీయాంశంగా మారినప్పటికీ... 'నా దారి రహదారి' అంటూ చెప్పిన డైలాగ్ ఇప్పటికే పాపులరే. అలాగే, ఇందులో రజనీకాంత్ తండ్రిగా శివాజీ గణేశన్ నటించగా, ఆయన తల్లిగా లక్ష్మి నటించారు. వీరితో పాటు నాజర్, మణివణ్ణన్, రాధారవి, ప్రకాష్‌రాజ్, సితార, సెంథిల్, అబ్బాస్, ప్రీతా విజయకుమార్, సెంథిల్, రమేష్ ఖన్నా, వడివుక్కరసి తదితరులు నటించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీత సమకూర్చిన ఈ చిత్రంలోని పాటలన్నీ సూపర్‌హిట్. రజనీకాంత్ - శివాజీ గణేశన్ కలిసి నటించిన చివరి సినిమా ఇదే కావడం గమనార్హం. కేఎస్ రవికుమార్ - రజనీకాంత్ కాంబినేషన్‌లో వచ్చిన 'ముత్తు' తర్వాత అతిపెద్ద హిట్ చిత్రంగా 'పడయప్ప' నిలిచింది.



'పడయప్ప'లో రజనీ, రమ్యకృష్ణ, సౌందర్య